జెడ్‌పి ఛైర్‌పర్సన్‌చే రహదారి పనుల పరిశీలన

ప్రజాశక్తి - పెదపాడు (దెందులూరు)

పెదపాడు మండలం సత్యనోలు నుంచి వడ్డిగూడెం వరకు నూతన రహదారి నిర్మాణ పనులను జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీప్రసాద్ బుధవారం పరిశీలించారు. దశాబ్దాలుగా ప్రజలను బాధిస్తున్న రహదారి సమస్యకు ఎట్టకేలకు ముగింపు పలికిన ఘనత కూటమి ప్రభుత్వానిదేనని పద్మశ్రీ అన్నారు.

పనులను పరిశీలిస్తున్న పద్మశ్రీ

జిల్లా పరిషత్‌లో..
నిబంధనలకు 'నీళ్లు'..!

- జెడ్‌పి ఆవరణలో స్థలాల కేటాయింపుపై ఆరోపణలు
- పంచాయతీరాజ్ మినిస్టీరియల్ ఉద్యోగుల సంఘం స్థల కేటాయింపులో పలు వివాదాలు
- తాజాగా వ్యాపార కార్యకలాపాలకు వాడుకునేలా అనుమతులివ్వడంపై తీవ్ర చర్చ
- జెడ్‌పిలో అడ్డగోలు నిర్ణయాలపై తీవ్ర విమర్శలు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

'జిల్లా పరిషత్ ఆస్తులను ఇష్టానుసారంగా పంచేస్తున్నారా.. నిబంధనలతో సంబంధం లేకుండా ఉత్తర్వులు జారీ చేసేస్తున్నారా.. పాలకులు, అధికారులు కుమ్మక్కై జెడ్‌పి ఆస్తులను అన్యాక్రాంతం చేస్తున్నారా' అంటే అవుననే సమాధానం వస్తోంది. జిల్లా పరిషత్ ఆవరణలో నిర్మించిన పంచాయతీరాజ్ మినిస్టీరియల్ ఉద్యోగుల సంఘం భవనాన్ని నిబంధనలకు విరుద్ధంగా వ్యాపార కార్యకలాపాలకు వినియోగించుకోవచ్చని తాజాగా ఉత్తర్వులు ఇచ్చినట్లు చర్చ సాగుతోంది. జిల్లా పరిషత్ పాలకులు, అధికారులు అంతా మూకుమ్మడిగానే ఈ వ్యవహారం సాగించినట్లు తెలుస్తోంది. పంచాయతీరాజ్ చట్టం 1994 ప్రకారం గ్రామ పంచాయతీ, మండల పరిషత్, జిల్లా పరిషత్‌లకు చెందిన ఆస్తిని ఉచితంగా ఇవ్వాలంటే రాష్ట్ర మంత్రివర్గం ముందు పెట్టాలి. అలాంటి ప్రక్రియ ఏమీ లేకుండానే 2018-2019లో ఎపి పంచాయతీరాజ్ మినిస్టీరియల్ ఉద్యోగుల సంఘం' జిల్లా శాఖకు తొలుత వందగజాలు, తర్వాత మరో 25 గజాలు మొత్తం 125 గజాలు కేటాయించేశారు. ఈ స్థలం జిల్లా కలెక్టరేట్‌కు వెళ్లే ప్రధాన రహదారి పక్కగా కేటాయించడం గమనార్హం. జిల్లా పరిషత్ ఆవరణలోని ఆ స్థలంలో రూ.30 లక్షలు వెచ్చించి ఆ సంఘ భవనం సైతం నిర్మించారు. నిబంధనల ప్రకారం ఉద్యోగ సంఘాలకు కేటాయించిన స్థలాలు, అక్కడ నిర్మించిన భవనాల్లో సంఘ కార్యకలాపాలు మాత్రమే నిర్వహించాలి. వాణిజ్య కార్యకలాపాలకు ఆ భవనాలు ఉపయోగించడం నిబంధనలకు విరుద్ధం. జెడ్‌పి ఆవరణలో స్థలం కేటాయింపు నిబంధనలకు విరుద్ధంగా సాగించడమే కాకుండా పంచాయతీరాజ్ మినిస్టీరియల్ ఉద్యోగుల సంఘ భవనంలో వాణిజ్య కార్యకలాపాలు చేసేందుకు అప్పట్లో ప్రయత్నాలు జరిగాయి. అయితే నాటి జిల్లా కలెక్టర్, జిల్లా పరిషత్ ప్రత్యేక అధికారి రేవు ముత్యాలరాజు దీనిపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసి ఆ భవనాన్ని స్వాధీనం చేసుకున్నారు. తర్వాత జిల్లా కలెక్టర్‌గా వచ్చిన కార్తికేయమిశ్రాను సదరు ఉద్యోగ సంఘాల నాయకులు కలిసి ఎటువంటి వాణిజ్య కార్యకలాపాలు చేయబోమని హామీ ఇవ్వడంతో సానుకూల దృక్పథంతో తిరిగి వారికి ఇచ్చారు. దీనికి సంబంధించి ప్రమాణ పత్రం సైతం నేతలతో రాయించుకున్నారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే భవనాన్ని స్వాధీనం చేసుకుంటామని స్పష్టం చేశారు.

ఇప్పుడు వ్యాపార కార్యకలాపాలకు అనుమతులు ఎలా?

పంచాయతీరాజ్ మినిస్టీరియల్ ఉద్యోగుల సంఘ భవనంలో వ్యాపార కార్యకలాపాలు చేయకూడదని విధించిన నిబంధనలు తుంగలో తొక్కి తాజాగా సంఘ భవనంలో వ్యాపార కార్యకలాపాలు నిర్వహించుకోవచ్చునని అధికారికంగా జిల్లా పరిషత్ నుంచి ఉత్తర్వులు ఇచ్చినట్లు తెలుస్తోంది. ఆ ఉత్తర్వులు సైతం 2023 ఏప్రిల్ అంటే గత వైసిపి ప్రభుత్వ హయాంలో జరిగిన జిల్లా పరిషత్ జనరల్ బాడీ తీర్మానం ప్రకారం ఇచ్చామని పేర్కొన్నట్లు సమాచారం. 2023లో తీర్మానం చేస్తే దాదాపు రెండేళ్ల తర్వాత 2025 జూన్‌లో ఉత్తర్వులు ఇచ్చారన్నమాట. రెండేళ్ల క్రితమే ఉత్తర్వులు ఎందుకు ఇవ్వలేదు. ఇప్పుడు ఎందుకిచ్చినట్లు.. రికార్డు ఏమైనా ట్యాంపరింగ్ జరిగిందా అనేది ఉన్నతాధికారులు తేల్చాల్సి ఉంది. వ్యాపార కార్యకలాపాలు నిర్వహించుకోవచ్చునని చేసిన తీర్మానం ఎజెండాలో, సప్లిమెంటరీ ఎజెండాలో ఉందా అనేది తేలాలి. తీర్మానం ప్రతిపాదించెవరో కూడా ప్రజలకు తెలియపర్చాల్సిన బాధ్యత జిల్లా పరిషత్ అధికారులపై ఉంది. అంతేకాకుండా 2023 ఏప్రిల్‌లో జరిగిన జనరల్‌బాడీ ప్రొసీడింగ్స్, మినిట్స్‌లో సదరు తీర్మానం నమోదు చేశారో, లేదో చెప్పాల్సి ఉంది. ఎటువంటి ఉత్తర్వులూ జారీ చేయకపోతే ఆ వివరాలైనా ప్రజలకు తెలియపరిచి అనుమానాలు నివృత్తి చేయాల్సిన బాధ్యత అధికారులపై ఉంది. అసోసియేషన్ భవనాన్ని వ్యాపార కార్యకలాపాలకు అనుకూలంగా మార్చుకుని నెలకు రూ.50 వేలు వరకూ ఆదాయం సంపాదించుకునే విధంగా ప్రణాళికలు రచించినట్లు తెలుస్తోంది. జిల్లా పరిషత్ పాలకులు, అధికారులు జెడ్‌పి ఆస్తులకు ట్రస్టీలుగా వ్యవహరించాలే తప్ప నిబంధనలకు విరుద్ధంగా అన్యాక్రాంతం చేయడం దారుణమని చెప్పొచ్చు. దీని వెనుక పెద్ద గూడుపుఠాణి జరిగినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీనిపై జిల్లా ఉన్నతాధికారులు విచారణ నిర్వహించి వాస్తవాలు ప్రజలకు తెలియజేయడంతోపాటు, జెడ్‌పి ఆస్తులను అన్యాక్రాంతం కాకుండా కాపాడాల్సి ఉంది. జెడ్‌పి ఆవరణలోని ఉద్యోగ సంఘ భవనంలో వ్యాపార కార్యకలాపాలు చేసుకోవచ్చునని జారీ చేసినట్లు తెలుస్తున్న ఉత్తర్వులపై జిల్లా పరితష్ సిఇఒ ఎం.శ్రీహరిని వివరణ కోరేందుకు ఫోన్‌లో ప్రయత్నించగా అందుబాటులోకి రాలేదు.

బిజెపి హయాంలో అప్రకటిత ఎమర్జెన్సీ

ఎమర్జెన్సీ నాడు-నేడు సదస్సులో సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

50 సంవత్సరాల క్రితం ఇందిరాగాంధీ ఆనాడు ఎమర్జెన్సీని ప్రకటిస్తే, నేడు బిజెపి హయాంలో అప్రకటిత ఎమర్జెన్సీ సాగుతుందని సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి ఉద్ఘాటించారు. స్థానిక పవర్‌పేటలోని సిపిఎం జిల్లా కార్యాలయం ఉద్దరాజు రామం భవనంలో బుధవారం ఎమర్జెన్సీపై జరిగిన జిల్లా సదస్సుకు ఆ పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు డిఎన్‌విడి.ప్రసాద్ అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథి రవి మాట్లాడుతూ నేటికి ఎమర్జెన్సీ ప్రకటించి 50 సంవత్సరాలు పూర్తవుతుందన్నారు. 1975 జూన్ 25న అప్పటి ప్రధాని ఇందిరాగాంధీ దేశంలో ఎమర్జెన్సీని ప్రకటించారన్నారు. దేశవ్యాప్తంగా అన్ని తరగతుల ప్రజల పోరాటాలు, ఉద్యమాలు నిర్బంధించడంతో ప్రభుత్వంపై పెరిగిపోతున్న వ్యతిరేకతను నిరంకుశంగా అణచివేసేందుకు దుర్మార్గపూరితమైన ఎమర్జెన్సీ విధించారన్నారు. దేశంలోని ఆర్‌ఎస్‌ఎస్, విహెచ్‌పి, భజరంగ్‌దళ్‌కు చెందిన వారు ఆనాటి ఎమర్జెన్సీని సమర్ధించారని స్పష్టం చేశారు. నేటి బిజెపి కూడా అప్రకటిత ఎమర్జెన్సీని దేశంలో సాగిస్తుందన్నారు. బిజెపి విధానాలకు వ్యతిరేకంగా ఎవరైనా మాట్లాడితే దేశద్రోహి పేరుతో అణిచి వేస్తుందని, ఇవి రాజ్యాంగ హక్కులను హరించే చర్యలని విమర్శించారు. ఆనాటి ఇందిరాగాంధీ ఎమర్జెన్సీని సమర్ధించిన బిజెపి నేడు ఎమర్జెన్సీకి వ్యతిరేకంగా సభలు నిర్వహించడం విడ్డూరంగా ఉందని ఎద్దేవా చేశారు. సిపిఎం నగర సీనియర్ నాయకులు కంది విశ్వనాథం ఆనాటి ఎమర్జెన్సీ కాలాన్ని గుర్తు చేసుకున్నారు, అవి చీకటి రోజులని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సదస్సులో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఆర్.లింగరాజు, జి.రాజు, కె.శ్రీనివాసు, పి.రామకృష్ణ, జిల్లా నాయకులు గుడిపాటి నరసింహారావు పాల్గొని మాట్లాడారు.

మాట్లాడుతున్న రవి

హైస్కూల్‌లో విద్యాశాఖ ఎడి తనిఖీలు

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

పట్టణ పరిధిలోని ఎస్ఆర్ఆర్ జెడ్‌పి బోయ్స్ హైస్కూల్‌ను విద్యాశాఖ జిల్లా ఎడి ఎం.వెంకటప్పయ్య బుధవారం తనిఖీ చేశారు. పాఠశాలలోని పలు రికార్డులను, డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు. రికార్డులపై పలు రకాల సూచనలు చేశారు. మధ్యాహ్న భోజన పథకం నిర్వహణ పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వెంకటప్పయ్య మాట్లాడుతూ విద్యార్థులకు అందించే ఆహారం అంశంలో ఎలాంటి రాజీ పడే ప్రసక్తి లేదని స్పష్టం చేశారు. ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా తన దృష్టికి తీసుకురావాలన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయిని డివిఎల్.పుష్పలత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న ఎడి

ఇరాన్‌పై దాడులను ఖండిస్తూ వామపక్షాల నిరసన

నినదిస్తున్న నేతలు, కార్యకర్తలు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ దాడులను ఖండిస్తూ వామపక్షాల ఆధ్వర్యంలో బుధవారం ఏలూరు వసంత మహల్ సెంటర్లోని పొట్టి శ్రీరాములు విగ్రహం వద్ద నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి, సిపిఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ కార్యదర్శి బద్దా వెంకట్రావు, ఎంసిపిఐ(యు) జిల్లా కార్యదర్శి శ్రావణంపూడి నాగరాజు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం మన సంప్రదాయ విదేశాంగ విధానానికి విరుద్ధంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. భారత్‌కు ఇరాన్ ఎల్లప్పుడూ స్నేహపూర్వకంగా వ్యవహరిస్తోందన్నారు. ఇరాన్‌పై దాడి చేయడానికి అమెరికా కుంటిసాకులు చెబుతోందన్నారు. అమెరికా ఇంటెలిజెన్స్ సంస్థలు, అంతర్జాతీయ అణు ఇంధన సంస్థ ఇరాన్ అణ్వాయుధాన్ని తయారు చేస్తోందనే ఆధారాలేవీ తమ వద్ద లేవని అంగీకరించాయన్నారు. అయినప్పటికీ అమెరికా, ఇజ్రాయిల్ దాడులు చేయడం దుర్మార్గమన్నారు. పాలస్తీనాపైనా ఇజ్రాయిల్ దాడులను ఆపాలన్నారు. అమెరికా యుద్ధోన్మాదాన్ని అందరూ వ్యతిరేకించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు ఆర్.లింగరాజు, డిఎన్‌విడి.ప్రసాద్, కె.శ్రీనివాస్, పి.రామకృష్ణ, ఎ.శ్యామలారాణి, పిచ్చుక ఆదిశేషు, సిపిఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ నాయకులు యర్రా శ్రీనివాస్‌రావు, ముంగం అప్పారావు, పల్లి లింగరాజు, ఎంసిపిఐ(యు) నాయకులు డి.ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కొయ్యలగూడెంలో భారీ వర్షం

ప్రజాశక్తి - కొయ్యలగూడెం

మండలంలో బుధవారం భారీ వర్షం కురిసింది. రెండు రోజులుగా చిన్న చినుకులతో కురిసిన వర్షం, ఈ రోజు ఎడతెరిపి లేకుండా కురవడంతో రోడ్లు జలమయమయ్యాయి. పొంగుటూరు-యాదవోలు, బయ్యన్నగూడెం-సరిపల్లి రోడ్లపై రాకపోకలకు వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. ఈ వర్షం వరి సాగుకు ఎంతగానో ఉపయోగపడుతుందని రైతులు సంతోషం వ్యక్తం చేశారు.

చిత్తడిగా మారిన పొంగుటూరు రోడ్డు

జిల్లా పోలీసు శాఖకు 17 ద్విచక్ర వాహనాలు కేటాయింపు: ఎస్‌పి

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

ప్రజలకు మరింత వేగంగా 112 సేవలు, ట్రాఫిక్ సేవలు అందించేందుకు పోలీసు శాఖ సన్నద్ధమైందని, అందులో భాగంగానే ప్రత్యేక ద్విచక్ర వాహనాలను ప్రభుత్వం పోలీసు శాఖకు కేటాయించిందని జిల్లా ఎస్‌పి ప్రతాప్ శివకిషోర్ అన్నారు. స్థానిక జిల్లా పోలీస్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నగర, పట్టణ జనాభా పెరుగుతుండటంతో పోలీసులు వేగవంతమైన సేవలందించడానికి కొన్ని ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. వీటిని అధిగమించేందుకు ప్రతి జిల్లా పోలీసులకు ప్రత్యేక ద్విచక్ర వాహనాలను కేటాయించారన్నారు. అందులో భాగంగానే ఏలూరు జిల్లాకు 17 ద్విచక్ర వాహనాలను కేటాయించారని తెలిపారు. 112 సేవల్లో భాగంగా మార్గం సరిగ్గా లేని ప్రాంతాలకు వెళ్లాలంటే ఈ ద్విచక్ర వాహనాలు కచ్చితంగా ఉపయోగపడతాయన్నారు. ఈ 17 వాహనాలను ట్రాఫిక్ పోలీసులకు ఆయన అందించారు. కార్యక్రమంలో ఎఎస్‌పి నక్కా సూర్యచంద్రరావు, డిటిసి డిఎస్‌పి ప్రసాద్, ఎఆర్ డిఎస్‌పి చంద్రశేఖర్, ఆర్ఐ పవన్‌కుమార్, త్రీటౌన్ సిఐ కోటేశ్వరరావు, ట్రాఫిక్ సిఐ లక్ష్మణరావు, సిబ్బంది పాల్గొన్నారు.

నగర వీధుల్లో బుల్లెట్ బండిపై జిల్లా ఎస్‌పి

నగర వీధుల్లో జిల్లా ఎస్‌పి బుల్లెట్ బండిపై ర్యాలీ నిర్వహించారు ప్రభుత్వ అందించిన ప్రత్యేక వాహనాలపై ట్రాఫిక్ పోలీసులతో కలిసి ఈ ర్యాలీ సాగించారు. ఎస్‌పి కార్యాలయం నుండి బయల్దేరిన ర్యాలీ ఫైర్‌స్టేషన్ సెంటర్, కొత్త బస్టాండ్, కలెక్టరేట్ మీదుగా తిరిగి ఎస్‌పి కార్యాలయానికి చేరుకుంది.

వాహనాలను ప్రారంభిస్తున్న ఎస్‌పి

కటకటాల్లోకి కీచక కోచ్ !

అథ్లెటిక్స్ కోచ్ వినాయక ప్రసాద్‌కు 14 రోజులు రిమాండ్

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

కీచక కోచ్ ఎట్టకేలకు పోలీసులకు చిక్కాడు. ఏలూరులో శాయ్ ప్రాంగణంలో శిక్షణ పొందుతున్న క్రీడాకారిణులపై లైంగిక వేధింపులకు పాల్పడిన అథ్లెటిక్స్ కోచ్ వినాయక ప్రసాద్‌ను పోలీసులు అరెస్టు చేశారు. ఏలూరు టుటౌన్ సిఐ అశోక్‌కుమార్ వినాయక ప్రసాద్‌ను అరెస్టు చేసి బుధవారం రాత్రి కోర్టులో హాజరుపర్చారు. న్యాయమూర్తి కోచ్‌కు 14 రోజులు రిమాండ్ విధించడంతో జిల్లా జైలుకు తరలించారు. దీనికి సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. శాయ్‌లో రెండు విభాగాల్లో విద్యార్థులకు శిక్షణ ఇస్తున్నారు. అథ్లెటిక్స్, వెయిట్‌లిఫ్టింగ్ విభాగంలో శిక్షణ పొందుతున్నారు. అథ్లెటిక్స్ విభాగానికి చెందిన దూలం నాగేంద్ర వెంకట వినాయక ప్రసాద్, వెయిట్ లిఫ్టింగ్ విభాగానికి సందీప్ కోచ్‌గా ఉన్నారు. వీరిలో వినాయక ప్రసాద్ సీనియర్ కావడంతో ఆయనే భారతీయ క్రీడా ప్రాధికారిక సంస్థ ఇన్‌ఛార్జిగానూ వ్యవహరిస్తున్నారు. కొంతకాలంగా వినాయక ప్రసాద్ క్రీడాకారిణులను తన ఛాంబర్‌కు పిలిపించుకుని అసభ్యకరంగా ప్రవర్తిస్తూ లైంగిక వేధింపులకు పాల్పడుతున్నట్లు విద్యార్థినుల ఫిర్యాదుతో వెలుగులోకి వచ్చింది. పాండిచ్చేరికి చెందిన బాలిక కోచ్ నిర్వాకాన్ని తల్లిదండ్రులకు చెప్పడంతో వారంతా కలిసి బెంగుళూరులోని శాయ్ కార్యాలయానికి ఫిర్యాదు చేశారు. అక్కడి నుంచి వచ్చిన బృందం విచారణ అనంతరం వేధింపులు వాస్తవమేనని నిర్ధారించి టుటౌన్ పోలీసులకు గత శనివారం రాత్రి ఫిర్యాదు చేశారు. దీనిపై కేసు నమోదు చేసిన టుటౌన్ ఎస్ఐ నాగ కళ్యాణి బాధితుల వద్ద నుండి స్టేట్‌మెంట్ రికార్డు చేశారు. ఏలూరు డిఎస్పి శ్రావణ్‌కుమార్ ప్రత్యేక బృందం ఏర్పాటు చేసి ఆరోపణలు ఎదుర్కొంటున్న కోచ్ వినాయక ప్రాద్ కోసం గాలింపు చర్యలు చేపట్టారు. ఎట్టకేలకు బుధవారంనాడు అతన్ని అరెస్టు చేసి కోర్టులో హాజరుపర్చగా న్యాయమూర్తి 14 రోజులు రిమాండ్ విధించారు.

పోలీసు స్టేషన్ నిర్మాణం ఆపాలని కొనసాగిన దీక్షలు

ప్రజాశక్తి - మండవల్లి

దొడ్డిదారిన పోలీస్ స్టేషన్‌కు స్థలం కేటాయించి, క్షణాల్లో స్థల పూడిక చేస్తారా.. అదే పేదల ఇళ్ల స్థలాల విషయంలో ఎందుకు పట్టించుకోలేదు.. ఇదెక్కడి న్యాయం అంటూ లబ్ధిదారులు బుద్దుల రాముడు, గిరిజాల పద్మ ప్రశ్నించారు. పేదల ఇళ్ల స్థలాల్లో పోలీస్ స్టేషన్ నిర్మాణాన్ని నిలుపుదల చేయాలని కోరుతూ తరుగుమూల ఇళ్ల స్థలాల పోరాట కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్షలు బుధవారం మూడో రోజు కొనసాగాయి. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేదల ఇళ్ల స్థలాలను పోలీస్ స్టేషనుకు కేటాయిస్తూ తీర్మానించే అధికారం పంచాయతీకి ఎవరిచ్చారని ప్రశ్నించారు. నాలుగేళ్లుగా స్థలాలు మెరక చేయండి అంటూ పంచాయతీని ప్రాధేయపడినా పట్టించుకోనివారు, దొడ్డిదారిన పోలీస్ స్టేషన్‌కు స్థలం కేటాయిస్తారా అని మండిపడ్డారు. పేదల ఇళ్ల స్థలాల అభివృద్ధి కోసం దొరకని మట్టి పోలీస్ స్టేషన్‌కు ఎక్కడి నుంచి వచ్చిందని నిలదీశారు. రెవెన్యూ కార్యాలయం వద్ద పోలీస్ స్టేషన్‌కు కేటాయించిన విశాలమైన ప్రాంతంలో పోలీస్ స్టేషన్ నిర్మించకుండా పేదల ఇళ్ల స్థలాల్లో నిర్మించడానికి ప్రయత్నించడం పేదల అభివృద్ధిని అడ్డుకోవడమేనని అన్నారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి పేదల ఇళ్ల స్థలాల్లో పోలీస్ స్టేషన్ నిర్మాణం నిలుపుదల చేసి, పేదల ఇళ్లకు అవసరమైన చర్యలు చేపట్టాలని కోరారు. లేనిపక్షంలో ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సింహాచలం, రాధ, సుజాత, జయ వెంకటరమణ, అలివేలు మంగతాయారు, వీరమ్మ తదితరులు పాల్గొన్నారు.

దీక్షల్లో పాల్గొన్న పేదలు, మహిళలు

పిఎం సూర్యఘర్ యూనిట్ల స్థాపన వేగవంతం చేయాలి

ప్రజాశక్తి - ఏలూరు

జిల్లాలో పిఎం సూర్యఘర్ కింద సోలార్ ప్యానల్ యూనిట్ల రిజిస్ట్రేషన్లు, స్థాపన ప్రక్రియను వేగవంతం చేసి మంచి ప్రగతి సాధించాలని జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం సాయంత్రం జిల్లా కలెక్టరేట్ గౌతమి సమావేశ మందిరంలో ప్రధానమంత్రి సూర్యఘర్ యోజన పథకం అమలులో భాగంగా సోలార్ రూఫ్‌టాఫ్ యూనిట్ల రిజిస్ట్రేషన్లు, స్థాపన ప్రగతిని విద్యుత్ శాఖాధికారులు, బ్యాంకర్లు, సోలార్ కంపెనీల ప్రతినిధులతో ఆమె సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఐదు లక్షలు కుటుంబాలు ఉండగా ఇప్పటికి కనీసం లక్ష దరఖాస్తులు రావాలని, 70 వేలు లక్ష్యమవ్వగా 52 వేల దరఖాస్తులే అందాయన్నారు. లక్ష్యసాధన కోసం రోజుకి వెయ్యి దరఖాస్తులు చేసినా నెలకు 30 వేలు దరఖాస్తులు వచ్చేవని, దీనిలో వెనుకబాటుకు కారణాలపై సమీక్షించారు. సిబ్బంది ఎంతమంది ఉన్నారు, రోజుకి ఎన్ని ఇళ్లు తిరుగుతున్నారు అని అడిగి తెలుసుకున్నారు. వచ్చిన దరఖాస్తులు మండలాలవారీగా సమీక్షించి, వెనుకబాటు ఉన్న వేగవంతానికి ఆమె దిశానిర్దేశం చేశారు. జిల్లాలో ప్రధానమంత్రి సూర్య ఘర్ పథకం లక్ష్యాలను సాధించాలన్నారు. బ్యాంకు రుణం మంజూరులో ఎటువంటి జాప్యం జరగకుండా ఎప్పటికప్పుడు పర్యవేక్షించి, 72 గంటల్లోగా రుణాలు మంజూరు చేయాలని బ్యాంకు అధికారులను ఆదేశించారు. సోలార్ యూనిట్ల స్థాపన వల్ల కలిగే ప్రయోజనాలను విస్తృత స్థాయిలో ప్రజలకు అవగాహన కల్పించేందుకు అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. దీనిపై అధికారులు, సిబ్బంది సమన్వయంతో పని చేయాలన్నారు. మంజూరైన యూనిట్ల స్థాపనలో వెండర్స్ ఎటువంటి జాప్యమూ లేకుండా పనులు పూర్తిచేసి వాడుకలోకి తీసుకురావాలన్నారు. యూనిట్ల స్థాపనలో ఏమైనా సమస్యలు ఉంటే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకొచ్చి పరిష్కరించుకోవాలన్నారు. ఈ సమావేశంలో విద్యుత్ శాఖ ఎస్ఇ పి.సాల్మన్‌రాజు, లీడ్ బ్యాంకు మేనేజరు డి.నీలాద్రి, ఇఇ ఎ.రాధాకృష్ణ, డిఇ, నోడల్ అధికారి ఎ.రమాదేవి, బ్యాంకర్లు, వివిధ మండలాల విద్యుత్తు శాఖ అధికారులు, సోలార్ కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.

కలెక్టర్ కె.వెట్రిసెల్వి

17 మంది చిన్నారులకు రక్తమార్పిడి

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఏలూరు సర్వజన ఆసుపత్రి ప్రాంగణంలోని రెడ్‌క్రాస్ తలసేమియా సెంటర్లో బుధవారం 17 మంది తలసేమియా చిన్నారులకు రక్తమార్పిడి చికిత్స నిర్వహించినట్లు జిల్లా రెడ్‌క్రాస్ ఛైర్మన్ డాక్టర్ ఎంబిఎస్‌వి.ప్రసాద్ తెలిపారు. ఈ సందర్భంగా డాక్టర్ ప్రసాద్ మాట్లాడుతూ తలసేమియా చిన్నారులకు ఇకనుంచి వారానికి రెండుసార్లు రక్త మార్పిడి నిర్వహించబోతున్నట్లు తెలిపారు. రెడ్‌క్రాస్ బ్లడ్ బ్యాంకులో సరిపడా రక్త యూనిట్లు నిల్వ ఉండేలా జాగ్రత్తలు తీసుకుంటున్నామని, కాబట్టి తలసేమియా, సికిల్‌సెల్ ఎనీమియా వ్యాధి చిన్నారులు రెడ్‌క్రాస్ సొసైటీలో రక్తమార్పిడి చికిత్స పొందాలని కోరారు. ఈ సందర్భంగా తలసేమియా చిన్నారులకు, వారి సహాయకులకు 40 మందికి భోజనాన్ని ఏర్పాటు చేసిన సిరిపల్లి వసుంధర, సత్యనారాయణలకు, ప్రోటీన్ పౌడర్లను, పండ్లను పంపిణీ చేసిన ఏలూరు రోటరీ క్లబ్ ప్రెసిడెంట్ ఎన్‌జివిబి.స్వామికి, రెడ్‌క్రాస్ కమిటీ సభ్యుడు శ్రీనివాస్‌కు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ ఛైర్మన్ జె.సత్యనారాయణరాజు, కార్యదర్శి బి.బెన్నీ, చిన్నపిల్లల వైద్యులు పిఎఆర్ఎస్.శ్రీనివాస్, కమిటీ సభ్యులు ఎ.నాగేశ్వరరావు పాల్గొన్నారు.



చిన్నారితో రెడ్‌క్రాస్ సభ్యులు

'చలి, జ్వరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి'

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

ప్రజలు చలి, జ్వరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, అశ్రద్ధ చేస్తే ప్రాణాపాయమని జిల్లా మలేరియా అధికారి పిఎస్ఎస్.ప్రసాద్ సూచించారు. మలేరియా నివారణ మాసోత్సవంలో భాగంగా బుధవారం మాదేపల్లి, లింగారావుగూడెంలో మలేరియా జ్వరాలు, తీసువాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ ప్రతిఒక్కరూ వారానికి ఒకసారి నీటి నిల్వ ప్రాంతాన్ని కడిగి మూతలు పెట్టుకోవాలన్నారు. ముఖ్యంగా డ్రమ్ములు, నీటి తొట్టెలపై మూతలు పెట్టాలని సూచించారు. సాయంత్రం పూట కిటికీలు వేసుకొని వేపాకుతో పొగ వేయాలని, జ్వరం వస్తే అశ్రద్ధ చేయకుండా స్థానిక ఆరోగ్య కేంద్రాన్ని, ఆశా కార్యకర్త లేదా ఆరోగ్య కార్యకర్తను సంప్రదించాలని సూచించారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మలేరియా అధికారి జె.గోవిందరావు, కమ్యూనిటీ హెల్త్ఆఫీసర్ రాజేశ్వరి, ఆరోగ్య విస్తరణాధికారి ఉమామహేశ్వరరావు, హెల్త్ సూపర్‌వైజర్ శేషావతారం, మలేరియా హెల్త్ అసిస్టెంట్ మేకా శ్రీనివాసరావు, ఆరోగ్య కార్యకర్తలు నాగమణి, రత్నకుమారి తదితరులు పాల్గొన్నారు.

ర్యాలీ నిర్వహిస్తున్న సిబ్బంది

మాదకద్రవ్యాల రహిత జిల్లాగా ఏలూరు

నేడు అవగాహనా ర్యాలీలు : కలెక్టర్

ప్రజాశక్తి - ఏలూరు

మాదకద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణా నివారణ అవగాహన కార్యక్రమంలో భాగంగా జిల్లావ్యాప్తంగా జిల్లా కేంద్రంలోని ఏలూరుతో పాటు ప్రతి మండలంలో ఈ నెల 26వ తేదీన అవగాహనా ర్యాలీ నిర్వహించాలని కలెక్టర్ కె.వెట్రిసెల్వి సంబంధిత అధికారులను ఆదేశించారు. ఎస్పి ప్రతాప్‌శివకిషోర్‌తో కలిసి వివిధ శాఖల జిల్లా అధికారులు, ఎంపిడిఒలు, తహశీల్దార్లతో మాదకద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణా నివారణ అవగాహనా ర్యాలీ, సమావేశాలు నిర్వహణ ఏర్పాట్లపై బుధవారం టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లా ప్రధాన కేంద్రమైన ఏలూరు పోలీస్ పెరేడ్ గ్రౌండ్స్‌లో ఈ నెల 26వ తేదీ గురువారం సాయంత్రం 4.30 గంటల నుంచి మానవహారం, ర్యాలీ నిర్వహించేలా ఏర్పాట్లు చేయాలన్నారు. ర్యాలీ అనంతరం మాదకద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణా నివారణకు కృషి చేసిన వారికి ప్రశంసా పత్రాలు అందించనున్నట్లు తెలిపారు.

'మానవత' ఆధ్వర్యాన విద్యాసామగ్రి పంపిణీ

ప్రజాశక్తి - కొయ్యలగూడెం

మానవత కొయ్యలగూడెం శాఖ ఆధ్వర్యంలో తొమ్మిదో వార్డులోని ఎంపిపి స్కూల్‌లో 40 మంది విద్యార్థులకు ఉచితంగా నోట్ బుక్స్, పెన్స్, పెన్సిల్స్, స్టేషనరీ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సంస్థ అధ్యక్షులు మందపాటి రామకృష్ణ, కార్యదర్శి తిరిగిపల్లి చంటిబాబు, కోశాధికారి చవ్వా రాము, ఛైర్మన్ విఎస్ఎన్.స్వామి, ఉపాధ్యక్షులు తిర్నాతి సిద్దార్థ, సహాయ కార్యదర్శి ఎస్‌బిజి.శేఖర్, షేక్ అమీర్ భాషా, శ్రీను, ముప్పనపల్లి వెంకటేశ్వరావు, కంభంపాటి సాయికృష్ణ, స్కూల్ ఉపాధ్యాయులు శివ పాల్గొన్నారు.

ప్రజా పోరాటాలు విస్తృతం చేయాలి : సిపిఎం

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

బిజెపిని ఒంటరి చేసి ఓడించాలని, సిపిఎం వర్గ, ప్రజా పోరాటాలు నిర్వహించి ప్రజా పునాదిని పెంచుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి పిలుపునిచ్చారు. ఏలూరులోని పవర్‌పేటలో ఉన్న సిపిఎం జిల్లా కార్యాలయంలో జరిగిన ఆ పార్టీ శాఖ కార్యదర్శి, ముఖ్య నాయకుల శిక్షణ తరగతుల్లో ఆయన మాట్లాడారు. గత రెండు రోజులుగా జరుగుతున్న శిక్షణా తరగతులకు సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు రామకృష్ణ ప్రిన్సిపల్‌గా వ్యవహరించారు. ఈ శిక్షణా తరగతుల్లో అఖిలభారత మహాసభల నిర్ణయాలు, శాఖ కార్యదర్శిలో పని విధానం, ప్రజా సంఘాల నిర్మాణం అనే అంశంపై రవి మాట్లాడారు. జిల్లాలో ప్రతి శాఖ స్థానిక సమస్యలను గుర్తించాలని, గుర్తించిన సమస్య పరిష్కారమయ్యే వరకు పోరాటాలను కొనసాగించాలని కోరారు. అనంతరం డిఎన్‌విడి.ప్రసాద్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా నాయకులు జి.రాజు, కె.శ్రీనివాస్, ఎన్.హనుమాన్లు, పి.పాండురంగారావు, ఎన్.నారపల్లి రమణారావు, కట్టా భాస్కర్, ఎస్.మహంకాళి, ఆర్‌విఎస్.నారాయణ పాల్గొన్నారు.

నాణ్యమైన వైద్య సేవలందించాలి : ఎంఎల్‌ఎ

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

వైద్యులు ప్రజారోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించి, నాణ్యమైన వైద్యం అందించాలని బుట్టాయగూడెం సామజిక ఆరోగ్య కేంద్రం ఛైర్మన్, పోలవరం ఎంఎల్‌ఎ చిర్రి బాలరాజు అన్నారు. సిహెచ్‌సి అభివృద్ధి కమిటీ నూతన నియామకం, సమావేశం బుధవారం ఆసుపత్రి ఛైర్మన్, పోలవరం ఎంఎల్‌ఎ చిర్రి బాలరాజు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోగులకు సంబంధించి వసతుల్లో లోపాలుంటే తన దృష్టికి తీసుకురావాలన్నారు. వర్షాకాలంలో ఏజెన్సీలోని అన్ని గ్రామాల్లో వైద్యాధికారుల పర్యవేక్షణ ఉండాలన్నారు. నూతన కమిటీలో సభ్యులుగా ఎంపీ పుట్టా మహేష్‌కుమార్, ఎంపిడిఒ కె.జ్యోతి, డాక్టర్ బి.వసుంధర, పంచాయతీ కార్యదర్శి దేవప్రియుడు, కరాటం జయశీరిష, కరాటం శ్రీకాంత్, కరిమికొండ శివాజీ ఉన్నారు.

జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించాలి :ఎపిడబ్ల్యూజెఎఫ్

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న జర్నలిస్టుల సమస్యల పరిష్కారం కోసం ఎపి వర్కింగ్ జర్నలిస్ట్‌ల సమాఖ్య (ఎపిడబ్ల్యూజెఎఫ్) నిరంతరం పోరాటం సాగిస్తూనే ఉందని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.ఆంజనేయులు అన్నారు. ఫెడరేషన్ జిల్లా కార్యవర్గ సమావేశం జంగారెడ్డిగూడెం సాయిబాలాజీ టౌన్ షిప్‌లోని మోహన న్యూట్రిషన్ సెంటర్‌లో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన ఆంజనేయులు పలు అంశాలు ప్రస్తావించారు. జర్నలిస్టులు ఎదుర్కొనే అనేక సమస్యలపై చర్చించారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన ఇళ్ల స్థలాల హామీ, వర్కింగ్ జర్నలిస్ట్‌లకు అక్రిటిడేషన్ల మంజూరు, సీనియర్లకు పెన్షన్లు తదితర కార్యక్రమాలు అమలు చేయాలని కోరారు. రాష్ట్ర కార్యదర్శి కెఎస్.శంకరరావు మాట్లాడారు. జిల్లా అధ్యక్షుడు ఎస్‌కె.జబీర్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో సీనియర్ జర్నలిస్ట్ కె.బాలసౌరి, ఫెడరేషన్ చింతలపూడి నియోజకవర్గ అధ్యక్షుడు కె.చిన్నారావు, కార్యదర్శి గొల్లమండల శ్రీనివాస్, జిల్లా ఉపాధ్యక్షుడు కె.కిరణ్ రవి, జాయింట్ సెక్రటరీ కలపాలశ్రీనివాస్, డివిజన్ ప్రెసిడెంట్ పిఎన్‌వి.రామారావు, బి.ప్రసాద్‌రాజు, కిషోర్, నక్కా శ్రీను, అప్పారావు పాల్గొన్నారు.

శానిటరీ వర్కర్ల సమస్యలు పరిష్కరించాలి

ఏరియా ఆసుపత్రి ఎదుట రిలే నిరాహార దీక్షలు ప్రారంభం

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

జంగారెడ్డిగూడెం ఏరియా ఆసుపత్రి శానిటరీ వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని, పెండింగ్ వేతనాలు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఎపి మెడికల్ కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ (ఎఐటియుసి) ఆధ్వర్యంలో బుధవారం రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. గత కొన్ని రోజులుగా జంగారెడ్డిగూడెం ఏరియా హాస్పిటల్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్నప్పటికి అధికారులు, కాంట్రాక్టర్ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ కనీసం స్పందించకపోవడంతో బుధవారం నుంచి విధులను బహిష్కరించి రిలే నిరాహార దీక్షకు పూనుకున్నామని ఎఐటియుసి జిల్లా కార్యదర్శి కంకిపాటి బుచ్చిబాబు తెలిపారు. రిలే నిరాహార దీక్షా శిబిరాన్ని ఎఐటియుసి గౌరవాధ్యక్షులు జంపన వెంకటరమణరాజు, ఎఐటియుసి మండల కార్యదర్శి కుంచె వసంతరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శానిటరీ వర్కర్ల సమస్యలు వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ (ఎఐటియుసి) జిల్లా అధ్యక్షులు కూనపాముల విఘ్నేష్, ఎఐటియుసి నాయకులు, వేముల రాజు, సంజీవ్, మేరీ, చంద్రకళ, దయామణి, జె.దుర్గారావు, పి.శ్రీను పాల్గొన్నారు.

వైద్య శిబిరాలు నిర్వహించాలని వినతి

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

వర్షాకాలంలో ఆదివాసీ గ్రామాల్లో మెడికల్ క్యాంపులు నిర్వహించాలని కోరుతూ న్యూ డెమోక్రసీ నాయకులు పోలవరం ఎంఎల్‌ఎ చిర్రి బాలరాజుకు బుధవారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వర్షాలకు ఏజెన్సీ వాసులు మలేరియా, టైఫాయిడ్, డెంగీ, కామెర్ల బారిన పడి ఇబ్బందులు పడుతున్నారని, వారికి ప్రభుత్వాసు పత్రిలో మెరుగైన వైద్యం అందించేలా చూడాలని కోరారు. అల్లికాలువ వద్ద ప్రభుత్వ మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రిని త్వరగా పూర్తి చేయాలన్నారు.

నేరాలు - ఘోరాలు

రైలు నుంచి జారి పడి మహిళ మృతి

ప్రజాశక్తి - ఉంగుటూరు

రైలులో ప్రయాణిస్తున్న మహిళ జారి పడి మృతి చెందిన ఘటన మండలంలోని బాదంపూడి - చేబ్రోలు రైల్వే స్టేషన్ మధ్యలో చోటు చేసుకుంది. తాడేపల్లిగూడెం రైల్వే ఎస్ఐ పి.అప్పారావు తెలిపిన వివరాల ప్రకారం... ట్రాక్‌పై 35 నుంచి 40 ఏళ్ల వయస్సు కలిగిన గుర్తు తెలీని మహిళ మృతదేహాన్ని మంగళవారం రాత్రి రైల్వే సిబ్బంది గుర్తించి అందించిన సమాచారంతో రైల్వే పోలీసులు బుధవారం ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తాడేపల్లిగూడెం ప్రభుత్వాసుపత్రి మార్చురీకి తరలించారు.

బైక్ చోరీపై కేసు నమోదు

టి.నరసాపురం :ద్విచక్ర వాహనం చోరీపై పోలీసులు కేసు నమోదు చేశారు. హెడ్ కానిస్టేబుల్ ఎం.రాజు తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని తెడ్లం గ్రామ పంచాయతీలోని మరియపురం గ్రామానికి చెందిన కొడవటి శ్రీను ఈ నెల 24వ తేదీ సాయంత్రం ఐదు గంటల సమయంలో మరియపురంలోని తన యజమాని తుమ్మూరి రవీంద్రనాథ్ రెడ్డి ఇంటి ముందు బైక్‌ను పార్కింగ్ చేసి వెళ్లి అరగంట తరువాత వచ్చి చూడగా అక్కడ బైక్ లేదు. చోరీకి గురైందని పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

నమ్మకానికి చిరునామా.. త్రినేత్ర హాస్పిటల్

24 గంటలూ అన్ని రకాల వైద్య సేవలు

వైద్యులు నాగేంద్రబాబు, సమత

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

త్రినేత్ర మల్టీ స్పెషాలిటీ, క్రిటికల్ కేర్ సెంటర్ హాస్పిటల్ నమ్మకానికి చిరునామా అని, 24 గంటలూ అన్ని రకాల వైద్య సేవలు అందిస్తామని ఆ ఆసుపత్రి వైద్యులు చవల నాగేంద్రబాబు, చవల సమత తెలిపారు. ఈ సందర్భంగా వారు ప్రజాశక్తితో మాట్లాడారు. తాము జంగారెడ్డిగూడెంలో పోలీస్‌స్టేషన్ వద్ద యూనియన్ బ్యాంక్ ముందు రోడ్డులో 2019లో త్రినేత్ర హాస్పిటల్ స్థాపించినట్లు చెప్పారు. అత్యాధునిక వైద్య సదుపాయాలతో ప్రజలకు విశ్వసనీయమైన సేవలతో ఈ ప్రాంతంలో వైద్య సేవలకు ఒక కొత్త దిశను అందిస్తున్నామన్నారు. అతి తక్కువ కాలంలో తమ హాస్పిటల్ పేరు ప్రఖ్యాతలు సంపాదించిందని చెప్పారు. తమ హాస్పిటల్‌లో ఎన్‌టిఆర్ వైద్య సేవ ద్వారా అన్ని రకాల వ్యాధులకు చికిత్స అందించనున్నట్లు తెలిపారు. చిన్నపిల్లలకు కూడా ఆరోగ్యశ్రీ వర్తిస్తుందన్నారు. త్రినేత్ర హాస్పిటల్‌లో పిల్లల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపిస్తూ శిశువుల నుంచి అన్ని వయస్సుల చిన్నారులకు వైద్య నిపుణులతో చికిత్సలు అందిస్తున్నామన్నారు. జ్వరాలు, దగ్గు, విరేచనాలు, శ్వాస సమస్యలు, పోషకాహార లోపాలు, వ్యాక్సినేషన్ మొదలైన వాటికి శాస్త్రీయంగా వైద్యం అందిస్తున్నట్లు తెలిపారు. వైద్యురాలు సమత ఒక మహిళా వైద్యురాలిగా ఇఎన్‌టి విభాగంలో ప్రత్యేక నైపుణ్యంతో కీర్తి సంపాదించారని నాగేంద్రబాబు తెలిపారు. చెవి, ముక్కు, గొంతు సంబంధిత సమస్యలకు అధునాతన చికిత్సలతో పాటు శస్త్రచికిత్సలు కూడా విజయవంతంగా నిర్వహిస్తున్నారన్నారు. పిల్లల ఇఎన్‌టి సమస్యల పరిష్కారంలో ఆమెకు ప్రత్యేక గుర్తింపు ఉందని తెలిపారు. ఈ హాస్పిటల్‌పై నమ్మకం ఉంచి ఇంత మంచి ఆదరణ కలిగించిన ప్రజలందరికీ ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు చెప్పారు. రానున్న కాలంలో తమ హాస్పిటల్ నుంచి మరెన్నో సేవలందించడానికి తాము ముందుంటామని తెలిపారు.

నాగేంద్రబాబు

సమత

త్రినేత్ర ఆసుపత్రి

ఆసుపత్రిలో ప్రత్యేకతలు

- -జనరల్ మెడిసిన్, సర్జరీ సేవలు
- -పిల్లల వ్యాధుల చికిత్స
- -చెవి, ముక్కు, గొంతు చికిత్సలు
- -ప్రస్తుత వైద్య సేవల పరిధిలో అత్యవసర సేవలు
- -డెర్మటాలజీ (చర్మ వ్యాధి చికిత్సలు)
- -మంచి సిబ్బందితో రౌండ్ ది క్లాక్ సేవలు,
- -అనుభవస్తులైన సిబ్బందితో అన్ని వేళల వైద్య సేవలు

పెండింగ్ కేసులపై దృష్టి : డిఎస్‌పి

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

సబ్ డివిజన్ పరిధిలో పెండింగ్ కేసులపై దృష్టి పెట్టనున్నట్లు పోలవరం డిఎస్‌పి ఎం.వెంకటేశ్వరరావు తెలిపారు. జీలుగుమిల్లి సర్కిల్ కార్యాలయాన్ని ఆయన బుధవారం సందర్శించారు. సర్కిల్ పరిధిలో ఇటీవల పలు కేసులకు సంబంధించి వివరాలను సిఐ వెంకటేశ్వరావును అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నేరాల నియంత్రణను తగ్గించాలని కోరారు.

పలువురికి ట్రిపుల్ ఐటీలో సీటు

ప్రజాశక్తి - ముసునూరు

పదో తరగతి పరీక్షా ఫలితాల్లో అధిక మార్కులు సాధించి ట్రిపుల్ ఐటీలో సీట్లు సాధించిన ఘనత తమ గురుకుల బాలికల పాఠశాలకే దక్కుతుందని ప్రిన్సిపల్ కె.లక్ష్మీకుమారి అన్నారు. ముసునూరు గురుకుల బాలికల పాఠశాల విద్యార్థులు కోప్పుల సాయి సింధు, తులిమెల్లి ఐశ్వర్య, టి.సాహితి, మారుమూడి జేసికా క్రిస్టల్, మోనూరి రోహిణి, మాతాంగి ప్రియాంక ట్రిపుల్ ఐటీలో సీట్లు సాధించారని చెప్పారు. వారిని ప్రత్యేకంగా అభినందించారు.

నూజివీడు టౌన్ :పట్టణ పరిధిలోని హనుమాన్ జంక్షన్ రోడ్డులో ఉన్న జెడ్‌పి బాలికల హైస్కూల్లోని ఐదుగురు బాలికలు ట్రిపుల్ ఐటీ సీట్లు సాధించినట్లు పాఠశాల హెచ్‌ఎం బి.అనురాధ తెలిపారు. నాయుడు కావ్య, నాయుడు కవితలకు ఇడుపులపాయలోని ఆర్‌కె వ్యాలీ ట్రిపుల్ ఐటీలో, మల్లాది సుష్మ, కాకి సులోచనలకు నూజివీడు ట్రిపుల్ ఐటీలో, షేక్ షాహినా సుల్తానాకు ఒంగోలు ట్రిపుల్ ఐటీలో సీట్లు లభించినట్లు తెలిపారు. తమ పాఠశాల బాలికలు అన్ని అంశాల్లో ప్రథమ స్థానంలో నిలుస్తారని సోదాహరణంగా వివరించారు.

విద్యార్థులకు ఏకరూప దుస్తులు

ప్రజాశక్తి - ముసునూరు

సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర పథకంలో భాగంగా మండలంలోని రమణక్కపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు మూడు జతల ఏకరూప దుస్తులు పంపిణీ చేసినట్లు హెచ్‌ఎం పివిఎస్.రామకృష్ణ తెలిపారు. ఈ కార్యక్రమంలో స్కూల్ కమిటీ ఛైర్మన్ ఎన్.రాజు, వ్యాయామ ఉపాధ్యాయులు వాకా నాగరాజు, ఉపాధ్యాయులు షకిలా, కొండయ్య, దుర్గ పాల్గొన్నారు.

నాణ్యమైన భోజనం అందించాలి

ప్రజాశక్తి - ముసునూరు

ప్రభుత్వ ఆదేశాల మేరకు మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం వడ్డించాలని ఎంఇఒ బివిఎస్.సుబ్బారావు అన్నారు. మండలంలోని చెక్కపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనం పథకాన్ని ఆయన బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాణ్యమైన భోజనం అందించాలన్నారు.

శక్తి యాప్‌పై అవగాహన

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

బాలికలు, విద్యార్థినులు, మహిళల భద్రత కోసమే శక్తి యాప్‌ను ప్రభుత్వం రూపొందించిందని, ఆపద సమయాల్లో ఈ యాప్‌ను వినియోగించుకోవాలని జిల్లా అదనపు ఎస్‌పి సూర్యచంద్రరావు తెలిపారు. నగరంలోని సెంట్ ఆన్స్ కళాశాలలో శక్తి యాప్‌పై బుధవారం అవగాహనా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎఎస్‌పి మాట్లాడుతూ శక్తి యాప్‌ను సెల్‌ఫోన్‌లో ఇన్‌స్టాల్ చేసుకుని ఆపద సమయాల్లో పోలీసుల సాయం పొందాలన్నారు. అత్యవసర నెంబర్లు 112, 1960లకు ఫోన్ చేయడం ద్వారా పోలీసుల సహాయం పొందవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో ఏలూరు డిఎస్‌పి శ్రావణ్‌కుమార్, శక్తి టీమ్ ఇన్‌ఛార్జి సిఐ సుబ్బారావు, మూడో పట్టణ సిఐ కోటేశ్వరరావు, సైబర్ సెల్ ఎస్ఐ పద్మ, సిబ్బంది పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

పట్టణంలోని శ్రీ సిద్ధార్థ జూనియర్ కళాశాల ఆవరణంలో నవజీవన్ బాలభవన్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మాదకద్రవ్యాల వినియోగ వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఫాదర్ తంబి జోసెఫ్ మాట్లాడుతూ మత్తు పదార్థాల వినియోగంతో యువత భవిష్యత్తు నాశనమవుతుందన్నారు. ఏ విధమైన మత్తు పదార్థాల జోలికి పోవద్దని హెచ్చరించారు. నూజివీడు పట్టణ సిఐ పి.సత్య శ్రీనివాస్ మాట్లాడుతూ మాదకద్రవ్యాలపై ముఖ్యంగా విద్యార్థుల్లో అవగాహన పెంపొందాలని సూచించారు.

జాతీయ లోక్ అదాలత్‌ను వినియోగించుకోండి

ప్రజాశక్తి - పోలవరం

రాజీయే రాజ మార్గమని సిఐ బాల సురేష్ అన్నారు. పోలవరం పోలీస్‌స్టేషన్‌లో పిటిషన్‌దారులకు లోక్ అదాలత్‌పై బుధవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్నచిన్న ఫిర్యాదులకు కోర్టుల వెంట తిరిగి సమయాన్ని, సొమ్మును వృధా చేసుకోకుండా లోక్ అదాలత్‌ను వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పోలవరం ఎస్ఐ ఎస్-ఎస్.పవన్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

ఆగిరిపల్లి :కేసుల సత్వర పరిష్కారానికి రాజీ మార్గమే రాజ మార్గమని, కక్షిదారులు కేసుల సత్వర పరిష్కారం కోసం జాతీయ మెగా లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని ఆగిరిపల్లి ఎస్ఐ కె.శుభశేఖర్ కోరారు. ఆగిరిపల్లి పోలీస్‌స్టేషన్‌లో పలువురు కక్షిదారులకు లోక్ అదాలత్ ద్వారా కేసుల సత్వర పరిష్కారంపై బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కక్షిదారులు ఏళ్ల తరబడి కోర్టుల చుట్టూ తిరిగి వారి ధనం, సమయాన్ని వృధా చేసుకోకుండా జాతీయ లోక్ అదాలత్‌ను వినియోగించుకోవాలని సూచించారు.

తెగిన విద్యుత్ వైర్లు : తప్పిన ముప్పు

ఉంగుటూరు :నారాయణపురం టూరింగు పేట దారిలో 11 కెవి లైన్‌పై ఇన్సులేటర్ కాలిపోవడంతో ఒకేసారి మూడు వేర్వేరు చోట్ల ఎన్‌టిఆర్ కాలనీ, కొల్లేరు ప్రజల తాగునీటి స్కీమ్ వద్ద, టూరింగుపేటలో వైర్లు తెగి నేలపై పడిపోయాయి. వెంటనే అప్రమత్తమైన లైన్‌మెన్ ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చి విద్యుత్ సరఫరాను నిలిపివేశారు. ఏకారణాలవల్లైనా విద్యుత్ తీగలు తెగితే వెంటనే సంబంధిత సబ్‌స్టేషన్‌లో బ్రేకర్ ట్రిప్ అవ్వాలి. అలా ట్రిప్ అయితేనే విద్యుత్ సరఫరా వెంటనే ఆగిపోతుంది. కాని బుధవారం జరిగిన ప్రమాదంలో వైర్లు నేలను తాకిన తరువాత సంబంధిత ట్రాన్స్‌ఫార్మర్‌లో ఫీజులు కాలిపోవడంతో విద్యుత్ సరఫరా ఆగింది. లేకుంటే నేలపై పడిన తీగలను ఆ సమయంలో ఎవరైనా తాకితే పెను ముప్పు జరిగేదని గ్రామస్తులు భయాందోళన వ్యక్తం చేవారు. సిబ్బంది సకాలంలో తెగిన తీగకు మరమ్మతులు చేసి సరఫరాను పునరుద్ధరించారు. వర్షం కురుస్తున్నా జారుతున్న స్తంభం ఎక్కి మరమ్మతులు చేసిన లైన్‌మెన్లు దుర్గారావు, మణికంఠలను గ్రామస్తులు అభినందించారు.

నిర్వాసితుల సమస్యలను పరిష్కరిస్తాం

జంగారెడ్డిగూడెం ఆర్‌డిఒ ఎంవి.రమణ

పోలవరం :పోలవరం నిర్వాసితుల పునరావాస ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ, భూమికి బదులు భూమి వంటి ప్రధాన సమస్యల పరిష్కారానికి సంబంధించి రైతు కూలీ సంఘం చేపట్టిన ఉద్యమం సఫలమైంది. ఈ నేపథ్యంలో బుధవారం పోలవరం తహశీల్దార్ కార్యాలయంలో రైతు కూలీ సంఘం నాయకులతో అధికారుల మధ్య చర్చలు జరిగాయి. ఈ నెల 24వ తేదీన కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించి కలెక్టర్‌కు వినతిపత్రం అందించిన విషయం తెలిసిందే. కలెక్టర్ ఆదేశాల మేరకు జంగారెడ్డి గూడెం రెవెన్యూ డివిజనల్ అధికారి ఎంవి.రమణ, పోలవరం తహశీల్దార్ బి.సాయిరాజు సమక్షంలో చర్చలు జరగగా సంఘం నాయకులు సమస్యలను వివరించారు. ప్రతిఒక్క నిర్వాసితుడు తమ వ్యక్తిగత సమస్యలపై రాజమహేంద్రవరం ప్రాజెక్ట్ అడ్మిని స్ట్రేటర్‌కు విడివిడిగా దరఖాస్తులు చేయాలని, అలా చేసిన పక్షంలో తగిన చర్యలు తీసుకుంటామని ఆర్‌డిఒ హామీ ఇచ్చారు.

అటవీ సంపదను పెంపొందించాలి

ఎపిఎఫ్ డిసిడిఎం సౌజన్య

జీలుగుమిల్లి :కార్పొరేషన్ ప్లాంటేషన్‌లలో ఉన్న కలప ద్వారా అటవీ సంపదను పెంపొందించాలని అటవీ అభివృద్ధి కార్పొరేషన్ జిల్లా మేనేజర్ జె.పుష్పసౌజన్య సిబ్బందిని ఆదేశించారు. మండలంలోని కామయ్యపాలెం బీట్ పరిధిలో 2015లో 27 హెక్టార్లలో నాటిన కార్పొరేషన్ జామాయిల్ ప్లాంటేషన్ కటింగ్‌కు రావడంతో క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జమాయిల్ ప్లాంటేషన్ కటింగ్‌కు రావడంతో వంద మొక్కల డేటా తీసుకొని దాన్ని కాటా వేసి దిగుబడి అంచనా వేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్లాంట్ మేనేజర్లు వసంత, డిపిఎం రామంజనేయులు, బీట్ అధికారులు, వాచర్లు పాల్గొన్నారు.

విజన్ 2047పై జెడ్‌పి డిప్యూటీ సిఇఒ సమీక్ష

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో స్వర్ణాంధ్ర, విజన్ 2047పై బుధవారం ప్రత్యేక సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా పరిషత్ డిప్యూటీ సిఇఒ భీమేష్ మాట్లాడుతూ స్వర్ణాంధ్ర లక్ష్యాలను సాధించేందుకు శాఖల మధ్య సమన్వయం పెంపొందాలన్నారు. అన్ని అంశాల్లో ప్రగతి సూచికలు, అభివృద్ధి సంక్షేమ పథకాలను నూరు శాతం అమలు చేయాలన్నారు. ప్రతి మండలంలో ప్రధాన రంగాలైన ఆరోగ్యం, విద్య, వాతావరణ పరిరక్షణ, గ్రామీణ అభివృద్ధి, పారిశుధ్యం, ఇంటింటికి తాగునీటి సరఫరాలో స్థిరమైన పురోగతి సాధించాలన్నారు. ఈ సమీక్ష సమావేశంలో ఎంపిడిఒ రాఘవేంద్రనాథ్, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

నియోజకవర్గ సంస్థాగత ఎన్నికల పరిశీలకునిగా రామారావు

కొయ్యలగూడెం :టిడిపి దెందులూరు నియోజకవర్గ సంస్థాగత ఎన్నికల పరిశీలకుడిగా పోలవరం ఎఎంసి మాజీ ఛైర్మన్ పారేపల్లి రామారావు నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనపై నమ్మకంతో ఈ బాధ్యతను అప్పగించిన చంద్రబాబుకు, లోకేష్‌కు ధన్యవాదాలు తెలుపుతున్నట్లు చెప్పారు.

సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

జాతీయ గ్రామ ఉత్కర్ష అభయాన్ కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపిడిఒ నిఖిల్ మధు శరణ్ తెలిపారు. మండలంలోని రెడ్డిగూడెంలో బుధవారం గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో పలువురు గిరిజనుల నుంచి పలు పథకాలకు సంబంధించి అర్జీలు స్వీకరించారు. గ్రామస్తులు పలు సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఈ కార్యక్రమంలో సర్పంచి పైదా ముత్యాలమ్మ, పంచాయతీ రాజ్ ఎఇ రామానుజం, ఎపిఎం ఝాన్సీ, ఎపిఒ జాన్ వెస్లీ, ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ వినయ్, హౌసింగ్ ఎఇ ప్రసాద్, పలు శాఖల అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కుక్కునూరు : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే పథకాలను నూరు శాతం గిరిజనులకు అందించటమే లక్ష్యమని ఎంపిడిఒ నరసింహారావు తెలిపారు. మండలంలోని కోమట్లగూడెంలో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ మాట్లాడుతూ గ్రామంలో తడి, పొడి చెత్తను గ్రీన్ అంబాసిడర్‌కు అందించి గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు.

పని గంటల పెంపు అన్యాయం

కుక్కునూరు :కార్మిక హక్కులపై దాడి చేస్తున్న కేంద్ర ప్రభుత్వం బాటలో రాష్ట్రప్రభుత్వం నడవడం సిగ్గుచేటని సిఐటియు మండల ప్రధాన కార్యదర్శి యర్రం సాయికిరణ్ బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. చంద్రబాబు అధ్యక్షతన జరిగిన రాష్ట్ర కేబినెట్ సమావేశంలో ఎనిమిది గంటల పనిదినాన్ని పది గంటలకు పెంచుతూ నిర్ణయం తీసుకోవడం అన్యాయమని పేర్కొన్నారు. చట్టాలను పరిరక్షించడానికి బదులుగా ఉల్లంఘిస్తున్న ప్రభుత్వ విధానాలను ప్రతిఒక్కరూ ఐక్యంగా ప్రతిఘటించాలని పేర్కొన్నారు.

జ్వరాలపై సర్వే

ప్రజాశక్తి - కొయ్యలగూడెం

మండలంలోని వంకబాతప్పగూడెం, మర్రిగూడెం గ్రామాల్లో బయ్యన్నగూడెం పిహెచ్‌సి ఆరోగ్య విస్తరణాధికారి సుబ్రహ్మణ్యం పర్యవేక్షణలో ఆరోగ్య సిబ్బంది ఇంటింటిని సందర్శించి ప్రజల ఆరోగ్య సమస్యల గురించి తెలుసుకున్నారు. జ్వరాలపై సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆరోగ్య విస్తరణాధికారి మాట్లాడుతూ పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పి విమల, సూపర్‌వైజర్ భాషా, హెల్త్ అసిస్టెంట్ సుబ్బారావు, ఎఎన్‌ఎం రమణ, ఆశా పాల్గొన్నారు.

కిడ్నీ బాధితునికి గౌడ సంఘం ఆర్థిక సాయం

ప్రజాశక్తి - కలిదిండి

మండలంలోని ఎస్‌ఆర్‌పి అగ్రహారం గ్రామానికి చెందిన గూడవల్లి నితిన్‌కుమార్ కిడ్నీ సమస్యతో బాధపడుతున్నాడు. విషయం తెలుసుకున్న గౌడ సంక్షేమ సంఘం కైకలూరు నియోజకవర్గ నాయకులు పోగైన చెంచు రామారావు, బొర్రా చలమయ్య బాధితుని తండ్రి శ్రీనివాసరావుకు రూ.1.35 లక్షల ఆర్థిక సాయం అందించారు. జన్యుపరమైన కారణాల వల్ల లివర్, కిడ్నీలు పాడయ్యాయని, ఆపరేషన్ నిమిత్తం రూ.70 లక్షలు ఖర్చవుతుందని వైద్యులు తెలిపారని బాధితుని తండ్రి శ్రీనివాసరావు తెలిపారు. ఆటో డ్రైవర్‌గా జీవనం సాగిస్తూ ఇప్పటికే రూ.పది లక్షల వరకు ఖర్చు చేసినట్లు చెప్పారు. దాతలు ముందుకొచ్చి ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో గౌడ సంఘం రాష్ట్ర నాయకులు పరసా ఏడుకొండలు, కైకలూరు నియోజక వర్గ నాయకులు, సభ్యులు పాల్గొన్నారు.

గంజాయి తరలిస్తున్న నలుగురు అరెస్టు

9 కేజీల గంజాయి స్వాధీనం

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

గుట్టుచప్పుడు కాకుండా ద్విచక్ర వాహనాలపై గంజాయిని తరలిస్తున్న ముగ్గురు యువకులను, ఒక బాలుడిని పోలీసులు అరెస్టు చేశారు. మూడో పట్టణ పోలీస్ స్టేషన్‌లో బుధవారం రాత్రి విలేకర్ల సమావేశం సిఐ కోటేశ్వర రావు వివరాలు వెల్లడించారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం... దుగ్గిరాల జాతీయ రహదారిలో మూడో పట్టణ సిఐ కోటేశ్వరరావు, ఎస్ఐలు రాంబాబు, అప్పారావు సంయుక్తంగా బుధవారం వాహన తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఈ సమయంలో రెండు ద్విచక్ర వాహనాలపై ముగ్గురు యువకులు, ఒక బాలుడు అనుమానాస్పదంగా కనిపించడంతో వారి వాహనాన్ని తనిఖీ చేయగా వారు గంజాయి తరలిస్తున్నట్లు గుర్తించి అదుపులకు తీసుకున్నారు. బాపట్ల జిల్లా అద్దంకి మండలం దేనుడకొండ గ్రామానికి చెందిన పైడా వేణు, ప్రకాశం జిల్లా కొత్తపట్నం మండలం పడర్తి గ్రామానికి చెందిన సింబతుల సాయి, అదే జిల్లా అదే ప్రాంతానికి చెందిన అలుగుల నాగవర్ధన్‌తో పాటుగా మరో బాలుడిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి తొమ్మిది కేజీల గంజాయిని, రెండు బైకులను, రూ.4,100 నగదును, ఒక సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు.

'మెరుగైన వైద్యం కోసం సిఎంఆర్‌ఎఫ్'

ప్రజాశక్తి - ఆగిరిపల్లి

నిరుపేదలకు మెరుగైన వైద్యం అందించడం కోసం సిఎం సహాయ నిధి ఎల్లప్పుడు అండగా ఉంటుందని రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార పౌరసంబంధాల శాఖా మంత్రి కె.పార్థసారధి అన్నారు. మండల పరిధిలోని ఈదులగూడెంలో కె.వెంకటసుబ్బమ్మ అనారోగ్యంతో బాధపడుతూ చికిత్స పొందుతుంది. మెరుగైన వైద్యం కోసం ఆమె కుటుంబసభ్యులకు గంట వ్యవధిలోనే సిఎం సహాయనిధి నుంచి రూ.రెండు లక్షల ఎల్‌ఒసి మంజూరు పత్రాన్ని మంత్రి అందించారు.

కొయ్యలగూడెం :మండలంలోని రాజవరం పంచాయతీలో నలుగురు సిఎం రిలీఫ్ ఫండ్ కోసం ఏలూరు ఎంపీ పుట్టా మహేష్‌కుమార్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకున్నారు. నలుగురికి కలిపి సుమారు రూ.1.10 లక్షల చెక్కులను కూటమి నాయకుల సమక్షంలో అందించారు. కాకర్లమూడి రాజేశ్వరరావుకు రూ.30 వేలు, భీమడోలు శేషమ్మకు రూ.31,843, నేర్సు దుర్గారావుకు రూ.20,500, భీమడోలు విజయలక్ష్మికి రూ.25 వేల చెక్కులను టిడిపి మండలాధ్యక్షులు పారేపల్లి నరేష్ అందించారు.

సేంద్రియ వ్యవసాయంపై అవగాహన

ప్రజాశక్తి - ముసునూరు

సేంద్రియ వ్యవసాయంపై రైతులకు అవగాహన కల్పిస్తున్నట్లు మండల వ్యవసాయ అధికారిణి ఎ.చాముండేశ్వరి అన్నారు. మండల పరిధిలోని చెక్కపల్లి, చింతలవల్లి శివారు గోగులంపాడు గ్రామాల్లో బుధవారం పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో చెక్కపల్లి గ్రామ సర్పంచి తల్లిబోయిన రాధిక సత్యనారాయణ, టిడిపి నాయకులు కాటేపల్లి సత్యనారాయణ, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

ముదినేపల్లి :రైతులంతా విధిగా విత్తన శుద్ధి చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి బి.వేణుమాధవ్ అన్నారు. మండలంలోని బొమ్మినంపాడు, అల్లూరు గ్రామాల్లో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వేణుమాధవ్ మాట్లాడుతూ రైతులకు పలు సూచనలు చేశారు. మండల ఎడిఎ జి.వెంకటమణి రైతులందరూ ఇ కెవైసి చేసుకోవాలని చెప్పారు.

ఆర్‌ఒఎఫ్‌ఆర్ పట్టాల జారీ కోరుతూ ర్యాలీ

ప్రజాశక్తి - కుక్కునూరు

బుధవారం నాడు 2006 అటవీ హక్కుల చట్టం ప్రకారం పోడు రైతులకు ఆర్‌ఒఎఫ్‌ఆర్ పట్టాలు జారీ చేయాలని డిమాండ్ చేస్తూ సిపిఐ (ఎంఎల్) ప్రజాపంథా కమిటీ ఆధ్వర్యంలో కుక్కునూరులో బుధవారం 500 మందితో భారీ ర్యాలీ నిర్వహించారు. పార్టీ కార్యాలయం నుంచి బయలుదేరిన ర్యాలీ అశ్వారావుపేట, బూర్గంపాడు, రామసింగారం రోడ్డు సెంటర్ గుండా అటవీ రేంజ్ కార్యాలయం వరకు చేరి, అక్కడ ధర్నా నిర్వహించి అధికారులకు వినతిపత్రం అందించారు. అనంతరం తహశీల్దార్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌కు వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి ఎస్‌కె.గౌస్, నాయకులు సిరికొండ రామారావు, కె.వీరస్వామి, కె.ముత్యాలరావు, ఎస్.చంద్రారావు, కె.కల్లయ్య, ఎస్.విజయ పాల్గొన్నారు.

టీచర్ పోస్టులను భర్తీ చేయాలి

కుక్కునూరు :మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో టీచర్ల కొరత ఉందని సిపిఐ పోలవరం నియోజకవర్గ కార్యదర్శి కారం దారయ్య అన్నారు. మండలంలోని పలు పాఠశాలలను ఆయన బుధవారం పరిశీలించి మాట్లాడారు. 41 పాఠశాలల్లో 114 టీచర్ పోస్టులకు 20 మంది రెగ్యులర్, 18 మంది డిప్యూటేషన్ టీచర్లు మాత్రమే పనిచేస్తున్నారని, 77 పోస్టులు ఖాళీగా ఉన్నాయని చెప్పారు. రాయిగూడెం, ఉప్పేరు, చీరవల్లి, రామసింగవరం మోడల్ పాఠశాలల్లో 26 టీచర్ పోస్టులకు కేవలం ఎనిమిది మంది టీచర్లతో విద్యాబోధన కొనసాగుతోందని, కొన్ని పాఠశాలలు ఒకే టీచర్‌తో నడుస్తున్న దయనీయ పరిస్థితి ఉందన్నారు. దీంతో విద్యార్థుల విద్య అగమ్యగోచరంగా మారిందని, సౌకర్యాల లేమితో ఇబ్బందులు పడుతున్నారని, పలువురు తల్లిదండ్రులు పిల్లలను ప్రయివేట్ పాఠశాలలకు పంపుతున్నారని, విద్యాశాఖ వెంటనే ఖాళీ పోస్టులను భర్తీ చేసి విద్యార్థులకు గుణాత్మక విద్యను అందించాలని డిమాండ్ చేశారు.

కోర్టు ప్రకటన

మహారాజశ్రీ 5వ అదనపు జిల్లా జడ్జి వారి కోర్టులో, ఏలూరు, ఏలూరు జిల్లా.

I.A.No.12/2025

in A.S.No.8/2025

Between:
Masina Veera Venkata Ratnam
...Petitioners/Appellant
And
1.Garapati Veera Raghavulu
2.Garapati Seshagiri Rao
...Respondents/Plaintiffs 1 and 2

1.**Respondent/Defendant 1**:
Garapati Veera Raghavulu, S/o.(Late) Gopala Rao, Male, aged 76 Yrs, Agriculture, R/o.D.No.11-76, Bhimadole Village and Mandal, Eluru District.

2.**Respondent/Defendant 2**:
Garapati Seshagiri Rao, S/o.(Late) Gopala Rao, Male, Aged 69 Yrs, Agriculturist, R/o.D.No.11-76, bhimadole Village and Mandal, Eluru District.

పై నెంబర్ దావా I.A.No.12/2025 - IN - A.S.No.8/2025 గ్రంథములో Respondents/ Plaintiffs 1 మరియు 2కు ఎన్నిపర్యాయములు నోటీసులు పంపించిననూ మీరు తీసుకొనకుండా కాలయాపన చేయుచున్నందున శ్రీకోర్టు వారు (సబ్‌స్టిట్యూట్ సర్వీస్) పేపరు ప్రకటన ద్వారా మీకు నోటీసు అమలుకు ది.**19-06-2025** తేదీన ఆర్డరు వేసినారు. ది.**30-06-2025**వ తేదీన వాయిదా మీరు పై వాయిదా తేదీన ఉదయం 10.30 ని.లకు పై కోర్టులో స్వయంగా గాని, అడ్వకేటు ద్వారా గాని కోర్టులో హాజరై ఆక్షేపణలు తెలియపరచుకొనవలెను. లేనియెడల మీ పై పరోక్షమున తీర్మానించబడును.

K.M.Srinivas Rao (Vasu)
Advocate, Bhimadole.
Cell: 9912181862